# కన్నీటి గోదారి

కీర్తి హారిప్రియ

## గోదారికి వరదొస్తే మా ఊళ్ళో మిగిలేది బురదే!

**ఈసారి కనీ వినీ ఎరుగని వర్షాలు.. చేతికందే పంట మట్టికరచుకుపోయింది.**

**గూట్లో ఉన్న అణా డబ్బులతో సహా పంట మీద పెట్టి దిగుబడి కోసం ఆశతో ఎదురు చూస్తున్న నా లాంటి రైతుల సంగతి వేరే చెప్పాలా? అంతులేని నిరాశతో కూరుకుపోయాం.. పైగా వరదలు...**

**నేను కొంతవరకు నయం. ఇంట్లో నేనూ నా భార్య రెండెద్దులు తప్ప వేరే పరివారం లేదు. ఉన్న ఒక్క అబ్బాయి చంద్రాన్ని చక్కగా చదివించాను.**

**నా కష్టం ఫలించి వాడు ప్రయోజకుడయ్యాడు. ఈ రోజు పట్నంలో ఉద్యోగం చేస్తున్న వాడంటే ఊళ్ళో కొందరికి కన్నెర్రగానే ఉంది.**

పట్నంనుంచి వచ్చినప్పుడు ప్యాంటు, షర్టు, బూట్లూ, దొరబాబులా కనిపిస్తుంటే ఉండదు మరీ!

నన్ను కొందరడిగే ప్రశ్నలు వింటే మాత్రం వళ్ళు కంపరమెత్తిపోతుంది. వాడు నెల కింత సంపాదిస్తున్నాడు? ఇంటికెంత పంపిస్తున్నాడు? ఎంత వెనకేశాడు?... ఇలాంటివి వాళ్ళడిగే ప్రశ్నలు. అసలు వాళ్ళకెందుకివన్నీ? పిల్లల సంపాదన దోచుకోవటానికేమిటి పెంచేది? వాడి మానాన వాడు పెళ్ళాం పిల్లలతో సుఖంగా ఉంటే చాలు కదా!

'పోస్ట్‌మాన్' సైకిలు మీద కనపడగానే లేచి పరిగెత్తుకుంటూ వెళ్ళాను.

'ఉత్తరాలేమీ లేవు' అన్నట్టు సైగ చేస్తూ వెళ్ళుతుంటే ఏదోలా అనిపించింది.

మా వాడి ఉత్తరం అందించేప్పుడు 'పోస్ట్‌మాన్' ఎంత మంచాడిలా కనిపిస్తాడో అలా వెళ్ళిపోయేప్పుడు అంత కోపంకూడా వస్తుంది. రెండ్రోజులుగా ఎదురు చూస్తున్నాను. అలా వెళ్ళిపోతాడే తప్ప ఒకసారి అడిగివెతికి చెప్పొచ్చుగా. అయినా వాణ్ననేం లాభం. మా ఊళ్ళో ఉన్న జనం ఎంతని! మా అందరి పేర్లూ ఇంటి పేరుతో సహా వాడికి తెలుసు. ఉత్తరం వస్తే ఊళ్ళో ఎక్కడ కనపడ్డా ఇస్తాడు కూడా. రానప్పుడు ఇంటి దగ్గర మాత్రం ఎక్కడినుంచి తెచ్చిస్తాడు!

ఇంట్లోకెళ్తుంటే గుమ్మంలో నా భార్య.

దేవుడు దాన్ని ఏ నిమిషంలో సృష్టించాడోగాని కళ్ళతోకావ్యాలు చెప్పేయగలదు. యక్ష ప్రశ్నలు అడగ్గలదు. కళ్ళ కింద ముడుతలు, మీద పడ్డ వయసు కూడా దాని కళ్ళలోని కళను మాత్రం చెరపలేకపోయాయి.

'ఉత్తరాలేం రాలేదు' అన్నట్టు పెదవి విరిచాను.

ఎంత కోపంగా చూసిందని! ఇందాక పోస్ట్‌మాన్‌ని నేను కూడా అలాగే చూసి వుంటాను. చిన్న తేడా ఏమిటంటే అతణ్ని నేను పరాయివాడిలా చూశాను. నేను మాత్రం పరాయివాణ్ణి కాదుగా! అందుకని అది తన కోపంలో పూర్తి స్వతంత్రం చూపించి లోపలికెళ్ళిపోయింది.

నేను గుమ్మంలో కూలబడి తిరిగి ఆలోచనల్లో కూరుకుపోయాను. గ్రామం ఖాళీ చేయటానికి ఇంకా అధమం ఒక్క రోజు టైముంది. ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. బళ్ళమీద సామాన్లు వేసుకుని ఊరొదిలి వెళ్తున్న వాళ్ళని చూస్తుంటే మనసంతా అదోలా అయిపోతోంది. కాని కాస్త ముందూ వెనకా అందరూ వెళ్ళిపోవాల్సిందే. మేం రేపే బయలుదేరాలనుకుంటున్నాం. అంతలోగా చంద్రం కబురేమయినా వస్తుందన్న ఆశ.

అంబలి గిన్నె నా ముందు పెడుతుంటే దాని కళ్ళలోకి చూశాను. కనిపించని భావం ఏదయినా కనిపిస్తుందేమోనన్నట్టు కళ్ళు తిప్పుకుని ఎడ్లసావిట్లోకి ఎడ్లకు చొప్ప వేయసాగింది.

ఇన్నేళ్ళ కాపురం తర్వాత ఆ మాత్రం నా కష్టం కాదూ! అంబలిగిన్నెతో కుంపటి దగ్గరకెళ్ళి చూశాను. అంబలి చేసిన మట్టి కుండ ఖాళీగా ఉంది.

ఇంట్లో గింజలు నిండుకున్నాయని నిన్ననే తెలుసు. అయితే మరీ ఒక్కరికే సరిపోయే అంబలి అవుతుందనుకోలేదు. సగం మింగి మిగతాది దానికి అందించాను. మాట్లాడకుండా తీసుకుంది.

వరద వస్తుందని తెలిశాక ఇక ఊళ్ళో అప్పు దొరకడం కష్టం. వారం రోజులు ముందే హెచ్చరికలు ప్రారంభించారు. కాబట్టి పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారయింది. ఎలాగోలా చారెడు బియ్యం దొరకపట్టి ఇంటికి చేసుకున్నాను. ఎటొచ్చీ డబ్బే దొరకలేదు. దొరకదని ముందే తెలుసుకూడా!

ఎందుకంటే కూలీ నాలీ చేసుకునే వాళ్ళకు డబ్బులు అప్పుగా దొరికితే దూర ప్రాంతాలకు వెళ్ళిపోయి ఎప్పటికో గాని తిరిగిరాదు. వరద నీరు తీసే సమయానికి కూలీ వాళ్ళు లేకపోతే

## కథలపోటీలో రెండో బహుమతిపొందిన కథ



కష్టంకదా! అంతులేని పనుంటుంది. ఎవరు చేస్తారదంతా!

తప్పకుండా డబ్బు కావాలంటే ఇచ్చే వాళ్ళు ఇస్తారు. కాని ఎవడు చస్తాడో ఎవడు బ్రతికి బట్టకడతాడో ఎవడికి తెలుసు? ఉన్న భూమిని చౌకగా కొనేసి డబ్బులిస్తారు. అలా అమ్ముకుని పోయేవాళ్ళు కూడా లేకపోలేదు. నా మటుకు నేను చచ్చినా అలాంటి పని చేయను. ఉన్న రెండెకరాలూ అమ్మేస్తే చంద్రానికి అన్యాయం చేసినట్టవుతుంది. పైగా వాడికి ప్రతి ఏడూ నాలుగయిదు బస్తాల బియ్యం కూడా పంపకపోతే ఎలా?

"ఏం చేద్దామండీ?" అడిగింది బేలగా చూస్తూ.

"చేయటానికేముంది? గవర్నమెంటోళ్ళు ఎక్కడికి తీసుకుపోతే అక్కడికిపోదాం. అని తేలిగ్గా అనేశానుగాని 'అక్కడ చంద్రం పరిస్థితి ఎలా ఉందో?' నన్ను దిగులు ఓ ప్రక్కన తొలుస్తూనే ఉంది.

* * *

మరువాడు!

"గోదారి నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. మరో పన్నెండు గంటల్లో వరద రావచ్చు. వెంటనేసురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోండి"

మైకుల్లో మాటి మాటికి హెచ్చరిక వినిపిస్తోంది.

ఊరు సగం పైనే ఖాళీ అయింది.

నేనూ బండికి ఎడ్లుకట్టి కొన్ని సామాన్లు ఎక్కించే ప్రయత్నంలో ఉన్నాను.

'పోస్ట్.. కేక విని అటు తిరిగి చూశాను.

పోస్ట్‌మాన్!

ఎదురుగా పరుగెత్తాను.

అతడు నా చేతికిచ్చిన కవరు మీద అక్షరాలు చూడగానే పోల్చుకున్నాను. అది చంద్రం రాసిందే! గబుక్కున జేబులో పెట్టుకున్నాను.

"ఇంకేమయినా ఉన్నాయా?"అని అడిగాను.?

"లేవు" అంటూనే వెళ్ళిపోయాడు.

ఆ ముసురులో చేతిలో గొడుగు పట్టుకుని వెళ్తూ ఉత్తరాలు పంచుతున్న పోస్ట్‌మాన్‌ని చూస్తే నిజంగా జాలేసింది. 'చాలా మంచివాడు

'తొందరగా రండీ'

ఆత్రంగా పిలుస్తున్న నా భార్యని చూస్తుంటే నవ్వొచ్చింది. అదెప్పుడూ అంతే! చంద్రం దగ్గర నుండి వచ్చిన ఉత్తరాన్ని చదివి వినిపిస్తుంటే ఆర్తిగా వింటోంది. కళ్ళు చెమ్మగిల్లి పోతాయి. కొడుకు ప్రయోజకుడయి ఎక్కడో ఉద్యోగం చేస్తూ ఎప్పుడోగాని రాసే ఉత్తరం చదవటంలో గల ఆనందం మాలాంటి ఒంటరి తల్లిదండ్రులకీ బాగా తెలుస్తుంది.

చేతులు తుడుచుకుంటూ చాపమీద కూ

ర్చుని జేబులోంచి ఉత్తరాన్ని భద్రంగా తీశాను. అక్కడక్కడా వాన చినుకులకు అక్షరాలు కొన్ని అలుక్కుపోయాయి.

అది నా ఎదురుగా కూర్చొని ఆత్రంగా చూస్తోంది.

'ప్రియమయిన అమ్మా నాన్నల పాదపద్మములకు నమస్కరించి వ్రాయునది...'

అని చదివి దానివైపొకసారి గర్వంగా చూశాను.

దాని కళ్ళల్లో ఒకమెరుపు...

మళ్ళీ చదవసాగాను.

'మీరు రాసిన ఉత్తరం అందింది. వారం రోజుల్లో వరదొచ్చి భూమి పత్రాలు పాడయిపోతాయోమోనని ముందు చూపుతో వాటిని నాకు పంపించారు. వాటిని నేను జాగ్రత్తగా చూసుకుంటాను. మీరేం విచారించవద్దు.

'ఊరొదిలి ఎక్కడికో వెళ్ళేబదులు నా దగ్గరికొస్తామని, డబ్బులు పంపించమని మొదటి సారిగా మీరుఎంతో అభిమానపడుతూ రాసారు. మీ ఉత్తరం అందేసరికి రెండ్రోజులయిపోయాయి. వెంటనే 'మనీ ఆర్డర్' చేద్దామనుకున్నాను. కాని అది మీకు చేరేవరకు కనీసం నాలుగు రోజులయినా పడుతుంది. అంతలో వరదొచ్చి మీరెక్కడుంటారో ఏమో! అందుకని పంపించటం లేదు.. అయినా మీరు కంగారుపడకండి...

"వాడే వస్తున్నాడేమోనండి" అంది.

నేను ఆపకుండా చదవసాగాను.

'వరదొచ్చేముందు గవర్నమెంటు వాళ్ళు జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు పేపర్లోచదివాను. అందరిలాగే మీరూ ఏదయినా సురక్షిత ప్రాంతానికి వెళ్ళండి. పరిస్థితులు సర్దుకున్నాక ఉత్తరం రాయండి. 'మనీ ఆర్డర్' పంపిస్తాను. అవసరమనుకుంటే నా దగ్గరకు వచ్చేయవచ్చు. కాని... వరదనీరు తీసేప్పుడు అక్కడ మీకు ఊపిరి సలపనంత పనుంటుంది కాబట్టి రారేమోనన్న అనుమానం కూడా ఉంది.

ఆరోగ్యం జాగ్రత్త. మీ కోడలు నమస్కారాలు తెలుపుతోంది. మనవడు, మనవరాలూ, ముద్దులుచెప్పమన్నారు.

ఉంటాను

పాదాభివందనములతో

మీ

చంద్రం

అది వాడు రాసిన ఉత్తరమేనా అని ఒకటికి రెండుసార్లు అక్షరాలు పరీక్షించాను. ముమ్మాటికీ వాడు రాసిందే! సందేహం లేదు.?

నా భార్యవంక చూశాను. దాని కంట్లోఎప్పట్లాగే కన్నీళ్ళు. అయితే అవి ఆనంద భాష్పాలు మాత్రం ఖచ్చితంగా కాదు.

చాలా సేపు మౌనంగా ఉండిపోయాను. చంద్రం గురించి ఎన్నో ఆలోచనలు. ఆ ఉత్తరాన్ని మరోసారి చదివాను.

పనివాళ్ళు దూర ప్రాంతాలకు పారిపోతారన్న భయం కొద్దీ వాళ్ళకు డబ్బు అప్పుఇవ్వని వాళ్ళు ఎంతో మంది గుర్తుకు రాసాగారా క్షణంలో

గోదావరిలాగే దుఃఖం కూడా ముంచుకొస్తుంటే లేచి బయటకెళ్ళాను. బండికి కట్టిన ఎడ్లను విప్పి కొంతదూరంగా దిగాను. అవి మిగతా బళ్ళ వెనక నడనడం మొదలెట్టగానే తిరిగి ఇంటి కొచ్చేశాను.

తలుపులు, కిటికీలు బార్లా తెరిచి వెళ్ళి నా భార్య ప్రక్కన కూర్చున్నాను. వెంటనే దగ్గరకు జరిగి నన్ను ఆర్తిగా బిగ్గరగా పట్టుకుంది.

చిన్నగా వెక్కుతూ ఏడవటం నాకు వినిపిస్తూనే ఉంది. కాని ఎలా ఓదార్చను?

మాటలు రాని నిర్వేదంలో మేముండగానే చీకటి పడసాగింది.

వరదగోదారి నీళ్ళ శబ్దం.

క్షణక్షణానికి దగ్గర పడుతోంది.

గోదారి తల్లికి వరదొస్తే మా ఊళ్ళో మిగిలేది బురదే అని కదూ మొదట చెప్పాను. బురద మాత్రమే కాదు. కొన్ని శవాలు కూడా ఎందుకు కనిపిస్తాయో అర్థం కావడంమొదలయింది.

అలా అర్థం అవుతున్న కొద్దీ అవుతున్న కొద్దీ...

గొంతులోన వణుకు.

కంటిలోన చినుకు.

వర్షించే...

గోదారి పొంగి పార్లేవరకు

*



## ఆపద

"మనకు పుట్టబోయే బిడ్డ అమ్మ వాలాగానే పుట్టాలని కోరుకున్నావా? ఎందుకూ?"

"మన పక్కింటి సుబ్బారావు లా పుడ్తే కొంపలంటుకోవూ..." భయంగా చెప్పింది మణి.

—ఎ.రమణకుమార్ (వైజాగ్)



## అందగాడు

టుప్! టప్! మంటూ మంకీ సినిమాలు ఫ్లాప్ అవుతున్నా అతగాడిలో సెన్సాఫ్ హ్యూమర్ తగ్గలేదు సుమండీ! మన సౌత్ వాళ్ళు తీసిన 'పర్దా హై పర్దా'లో మంకీ బాబు హీరో మరి హీరోయిన్ అంటారా మీనా!

"అబ్బే! ఆ పిల్ల నల్లగా, అన్‌యింప్రెసివ్‌గా వుంది. వట్టి నల్ల ఇడ్లీ" అని కామెంట్ వేస్తున్నాడు మీనాని.

పెద్ద తనో గొప్ప అందగాడిలా...!

—నీహారిక

